# దాగిన సత్యం

శ్రీ నందివాడ శ్రీకృష్ణ చిన్నంరాజు

"బాబూ గంపెయ్యాలా" అంటూ తిరుగుతోంది సుబ్బి, బజారులో వస్తువులుకొనే ప్రతి వ్యక్తినీ దీనంగా చూస్తూ. అప్పటి కప్పుడే 12 గంటలవేళ అవుతూంది. ఆ రోజు సంత అవడంచేత బజారంతా జన సమూహంతో కిటకిటలాడుతోంది. పాపం! సుబ్బిలోవున్న అమాయికత్వమే ఆమెకు కూలి దొరక్కపోవటానికి ముఖ్యమైన కారణమంటారు తక్కిన గంప కూలీలు. సుబ్బికి సంవత్సరము దాటని మగశిశు వున్నాడు. ఒక ప్రక్క రోగిష్ఠి భర్తకి సేవ చెయ్యటం, రెండవ ప్రక్క సంసారానికి సరిపడే డబ్బంతా కూలిచేసి సంపాదించటం సుబ్బికి దుర్భరమైన కష్టాలు. ఆ స్థితిలోనే పిల్లాడికి పాలుచాలని అవస్త. కడుపునిండా తినడానికి కూడైనా లేనిస్థితిలో పిల్లాడికి పాలెలా కొనగల్గుతుంది. అయినప్పటికి యెల్లాగో కాలంగడుపుతూన్న సుబ్బి యెటువంటి ఇల్లాలో! ఆ అవస్తతోనే తిరుగుతోంది సుబ్బి బజారులో. చివరికి ఒకాయన "యేయ్ గంపా! ఇల్లారా" అన్నాడు. అంతవరకూ తిరిగితిరిగి నిరాశ హృదయంతో యింటికిపోవట మెల్లాగా అనుకుంటూన్న సుబ్బి గభాల్ని ఆయన వద్దకు పోయింది.

"రెడ్డిపేటకు యేమిమ్మన్నావు" అన్నాడు.

"తమకు తెల్దేటి బాబూ! మామూలే" అంది సుబ్బి అమాయకంగా.

"సరే ఆ బియ్యంమూట గంపలో వెయ్యి" అన్నాడు. మారు మాటాడకుండా బియ్యంమూట గంపలో వేసింది సుబ్బి. ఆయనవెంట బయలుదేరింది. త్రోవలోనున్న మరికొన్ని దుకాణాలవద్ద మరికొన్ని సామాన్లు కొన్న తర్వాత ఆయన సుబ్బితోకూడ రెండు గంటలకు చేరుకున్నాడింటికి.

"గదిచూపిస్తా అందులో పెట్టిరా" అన్నాడు వెంకటశాస్త్రులు.

ఇంట్లో ఆడాళ్ళేమంటారో అని సంకోచిస్తు నిలబడిపోయింది సుబ్బి.

"భయంలేదులే ఇంట్లో యెవరూలేరు" అన్నాడు వెంకటశాస్త్రి.

గదిలో సామాను వెలిపేసి "త్వరగా పంపండి బాబూ యింటికాడ పిల్లాడేడుస్తాడు. ఇయ్యాల పాలేనా పొయ్యలేదు" అంది సుబ్బి.

"నీకు పిల్లలెందరు" అన్నాడు వెంకటశాస్త్రి.

"ఒక్కడే బాబయ్యా! త్వరగా పంపండి బాబూ" అంది.

"కూలిమాటకేంకాని వెధవ కూలి నీఇష్టమొచ్చినంత తీసుకో, కాని...నిన్ను

చూసిన దగ్గిరనుంచి నాకదోలావుంది. యిలా దగ్గిరకురా" అన్నాడు వెంకట శాస్త్రి.

"అదేమిటి బాబూ తమరు చూస్తే పెద్దోరు. మా లాటోల్లనలాగనొచ్చా." అందామె జారిపోతున్న పమిటను సరి చేస్తూ.

"ఆ పెద్దేమిటి చిన్నేమిటి" అంటూ వచ్చి సుబ్బి చెయ్యి పట్టుకోబొయ్యాడు వెంకటశాస్త్రుల్లు.

అంతటితో సుబ్బి సహించలేకపోయింది.

"అదేటి బాపనయ్యా, నువ్వుచూత్తే శాత్తుర్లు గోర్లాగున్నావు; మా లాటోల్తో నీకెందుకయ్యా" అంటూ చేతులోవున్న గంపతో అడ్డగించుకుంది, శాస్త్రిగారు చెయ్యబోయే నీచపు కార్యాన్ని. శాస్త్రి పట్టలేని కామోద్రేకంతో ఆమె రొమ్ముల మీాదికి చెయ్యిపోనిచ్చాడు. ఆమె తన శీలానికి భంగం కలుగుతుందేమోనని భయంచేత తన చేతిని విసిరింది. ఆ విస రటంలో ఆమె చేతినున్న రాగికడియం శాస్త్రి ముక్కుకుతగిలి ముక్కంట రక్తం కారటం ప్రారంభించింది. రక్తాన్ని చూడ డంతోనే శాస్త్రికి ప్రాణాలు తల కెక్కాయి. "చచ్చానర్రోయి" అని పెద్దకేక పెట్టేడు. ఆ కేక వినడంతోనే యిరుగు పొరుగుల వాళ్లంతా యేమిటి సంగతంటూ వచ్చారు. "దొంగముండ" అని శాస్త్రి యింకా యేమో కల్పించి జెప్పకుండానే అంతమందీకలిసి ఆమెను తలోపోటు పొడిచి వీధిలోకి నెట్టేసేరు. పాపం! అంతమందిలోనూ ఒకరేనా నిజ స్థితి తెలుసుకోవడానికి ప్రయత్నించటం లేదు, పాపిష్టిలోకం! యెండ తీవ్రంగా కాస్తోంది. వంటినిండా తగిలిన దెబ్బలు యెండవేడికి మండుతున్నాయి. ఆ సమ యంలోకూడా ఆ పతివ్రతామతల్లి తన భర్త యింటివద్ద యెలా బాధపడు తున్నాడో అన్న తొందరలో వచ్చేస్తోంది యింటికి పాపం! పిల్లాడెంత చిచ్చుపెట్టేస్తు న్నాడో అని ఆమె మరీ తొందరగా నడు స్తూంది. పరధ్యాన్నంగా నడుస్తూన్న ఆమె రోడ్డు మధ్యనుంచే వీధి మలుపు తిరుగుతోంది. క్షణకాలంలో ఆమె రెండో ప్రక్కనుంచి వచ్చేకారుక్రింద పడి పోయింది.

"బ్రేకు సడన్‌గానే వేశానుబాబూ ఆమె యేమాత్రం తప్పుకున్నా ప్రమాదము లేకపోను" అన్నాడు డ్రైవరు తన యజ మానియైన కామేశ్వరరావుగారితో.

"సరేలే జరిగిందేదో జరిగింది. ఆమెకు వెంటనే చికిత్స చేయించాలి." తెలివి తప్పిపడిన సుబ్బిని సమీాపిస్తూ అన్నారు కామేశ్వరరావుగారు. కాని ఆయనకళ్లి బడింది సుబ్బికాదు. సుబ్బిశవం. ప్రమాద వశంచేత తన కారుక్రింద సుబ్బిపడి చని

పోయినందుకు చాలా విచారించేడు. సుబ్బి భర్తనీ, పిల్లాడినీ తీసుకరమ్మని కబురంపేడు. నాటితో సుబ్బి భర్తకూ, బిడ్డకూ కష్టాలన్నీ తీరిపోయేయి. సుబ్బిభర్తని, పిల్లాడిని అనాధశరణాలయంలో చేర్పించేరు కామేశ్వర రావుగారు. కాని సుబ్బిమాత్రమే అన్యాయపు చావు చచ్చింది. అయితే చావులో కూడ తనవారికి సేవచేసింది.

——(౦)——

# "సుభాషితాలు"

ధూళిమయమైన ధరణి ఒడిలో శిశువుల్లా దుఃఖాలు, సుఖాలు, ఆశలు, భయాలు, దుర్బలతలూ ఉన్నై. వాటిలో ఎన్నో భ్రాంతులు, ఎన్నో వ్యథలు, ప్రేమలు ఒకదాని కొకటి కలిపి వ్యాపించి ఉన్నై.

"రవీంద్రనాథ్ టాగూరు"

♦ ♦ ♦ ♦

స్త్రీరహస్యం తెలుసుకోవడం ఎవరికీ సాధ్యంకాదు. దూరంనుంచే ఒక్క నమస్కారంచేసి ఊరుకోవడమే ఉపాయము. అదే ఉత్తమోత్తమము.

"చింతా దీక్షితులు"

♦ ♦ ♦ ♦

స్త్రీ, వీధిలో దేవకన్య, చర్చిలో సాధువు, కిటికీ దగ్గర సౌందర్యరాశి, ఇంటిలో నమ్మదగినవ్యక్తి, శయ్యమీద రాక్షసి, అదే ఒకప్పుడు పిశాచి.

"ఫ్రెంచి నవలాకారుడు"

♦ ♦ ♦ ♦

స్త్రీ సహజంగా అంతర్వాసిని. రహస్యంగా తనలో తాను నివసిస్తుంటుంది. హృదయ ప్రతిబింబం దేహశోభయందు ప్రకటితమై ప్రకాశించకపోతే ఎవరూ ఆమెను చూచి అర్థంచేసుకోలేరు.

"రవీంద్రనాథ్ టాగూరు"

♦ ♦ ♦ ♦

దాస్యము, స్వాతంత్ర్యముకూడా శృతిమించినపుడు అవి అరిష్టాన్ని కలుగజేయుటలో ఆశ్చర్య మేమీలేదు. అయినా సమపాళ్లలో ఉంటే ఎంతో మంచిది.

"ప్లాటో"

♦ ♦ ♦ ♦

సత్యం, చీరెసింగారించుకొనే లోపల, అసత్యం భూప్రదక్షిణచేసి వస్తుంది.

"జాన్ ప్లోమస్"

సేకరణ : ఇందు ముఖలింగం.

——(౦)——